



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగింది పేసెంజర్ రైలు. ముసలయ్య ఆదే మొదటిసారి తను పుట్టిపెరిగిన పల్లెటూరు వదిలి సికింద్రాబాద్‌లాంటి పెద్ద వూరుకు రావడం.

పొద్దుగాటి ప్లాట్‌ఫారం, ఆ ప్లాట్‌ఫారంమీద వివిధ రకాల దుస్తుల్లో హడావిడిగా తిరుగుతున్న అనేక రకాల మనుష్యులు, దేదీప్యమానంగా వెలిగే లైట్లూ చూసి బిత్తరపోయాడు ముసలయ్య. నాలుగయిదు క్షణాలు భయపడ్డాడు కూడా. రైల్వే కంపార్ట్‌మెంట్ కిటికీ లోంచి బయటికి చూస్తూ అలాగే కూర్చున్నాడు ముసలయ్య అయిదారు నిముషాలదాకా.

ముసలయ్య కళ్లు దీక్షగా 'అబ్బాయి గారి' కోసం వెదికాయి. ముసలయ్య కళ్ళకి అబ్బాయిగారు కనబడలేదు ఎక్కడా. బిక్కుబిక్కు మంటూ, విస్ఫారిత నేత్రాలతో చూస్తూండి పోయాడు ముసలయ్య కాసేపు.

"మీ వాళ్ళు రాలేదా?"ముసలయ్యతో పాటే ప్రయాణంచేసిన ఓ ముసలాయన అడిగాడు ముసలయ్యని, బయట ప్లాట్‌ఫారంమీద నించుని. అప్పటికే ఆయన తన సామాను దింపుకుని, కూలీ వెంట వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

ముసలయ్య తల అడ్డంగా తిప్పాడు.

"కిందికి దిగి ఓ సారి ప్లాట్‌ఫారం అంతా తిరిగి చూడు. బాంబేబండి అందుకోవాలి నేను. ఎవరికయినా అడ్రసు చెప్పి జాగ్రత్తగా వెళ్ళు."

ఆ ముసలాయన తన బాధ్యత తీరినట్లుగా వెళ్లిపోయాడు గబగబా కూలీ వెంట. ముసలయ్య సీటు కిందవున్న తన చేతి సంచీని అందుకుని, ఖాళీ అయిన ఆ పెట్టెలోంచి దిగాడు కిందికి.

ముసలయ్యకి అరవై ఏళ్లు లేవు. ఏడేళ్ళు మాత్రమే. మరో ఏభై ఏళ్లు గడిస్తే ముసలయ్యకి ఆ పేరు అతికినట్లు సరిపోతుంది. ఇప్పుడు మాత్రం విచిత్రంగా అనిపిస్తుంది చాలా మందికి.

వెయ్యిమంది జనాభా మించని పల్లెటూరిలో పుట్టి పెరిగాడు ముసలయ్య. ముసలయ్య తండ్రి చదువుకోలేదు. తన తాతగారి పేరు పెట్టాడు తన కొడుకుకి ఏడేళ్ళ ముసలయ్యకి ఏదో ఎక్కఁదాకా కూడా రాదు. తెలుగక్షరాలన్నీ వరసగా చెప్పలేడు. చదువుకోలేదు. కాని ఎడ్లబండితోలగలడు. పాదులకి కుదుళ్ళు చేయగలడు. నూకలు వండగలడు. పాలు పితగ్గలడు. ఇంకా చాలా చేయగలడు.

కారణం, "అబ్బాయిగారి" ఇంట్లో పాలేరు కొడుకు ముసలయ్య. పట్టణంలో ఇంగ్లీష్ కాన్వెంట్‌లో చదువుకొనే ముసలయ్య ఈడు అబ్బాయిలలోవుండని ధైర్యం, చొరవముసలయ్యలోవున్నాయి

అవి వుండబట్టే, వంటరిగా సికింద్రాబాద్ రాగల సాహసంచేసాడు, తండ్రిని వప్పించి.

"అబ్బాయిగారు"రైలుస్టేషన్‌కివచ్చి ముసలయ్యని ఇంటికి తీసుకెళ్తానని వుత్తరం వ్రాసారని, ముసలయ్య తండ్రి రైలెక్కించాడు తన కొడుకుని. అట్టే భయపడకుండా అబ్బాయిగారు వ్రాసిన పోస్ట్‌కార్డు ముసలయ్య జేబులో వుంచి అన్నాడు రైలుఎక్కించబోయే ముందు.

"ఏకారణం చేతయినా స్టేషన్‌కి ఆయన రాకపోతే, ఈ వుత్తరం ఎవరికయినా చూపించు. ఎడ్రస్‌వుంది దీంట్లో ఎవరయినా తీసుకెళ్లి దిగబెడతారు."

ఆ స్టేషన్‌లో రైలు కేవలంనిముషం సేపు మాత్రమే ఆగుతుంది. పల్లెటూరు అవటంవల్ల ముసలయ్య తండ్రి ముసలయ్యని ఓ పెట్టెలోకి ఎక్కించి, ఓ ముసలాయనకి సంగతి వివరించి, రైల్లో

తోడుగా వుండమని ప్రాధేయపడ్డాడు. ఆ ముసలాయన అందుకు సమ్మ తించాడు.

ఆ ముసలాయన మరో రైలు ఎక్క టానికి వెళ్లిపోయాడు. ముసలయ్య ఒంట రిగా ఠయిపోయాడు. చాలా సేపు దీక్షగా చూసాడు అందరివంకా, అందరూ కన బడ్డారు కాని అసలయిన 'అబ్బాయిగారు' కనబడలేదు

ప్లాట్‌ఫారంమీద తెల్లకోటులో వున్న టిక్కెట్ కలెక్టర్ తన ఎక్సరే కళ్ళతో టిక్కెట్ లేకుండా ప్రయాణంచేసే దోషుల కోసం వెదుకుతున్నాడు. ముస లయ్య అతనిఎక్సరే కళ్ళలో చిక్కాడు.

"నీటిక్కెట్ ఏది?" గదమాయిస్తూ అడిగాడు ఆ టి.సి. ముసలయ్య దగ్గరకి నడిచి.

అర్థంకానట్లుగా చూసాడు ముసలయ్య టి. సి. వంక, ఏమిటన్నట్లుగా.

"ఎక్కడనుంచి వస్తున్నావ్?" అడి గాడు

ముసలయ్య తను దిగిన రైలు పెట్టెవంక చూపించాడు.

"ఏ వూరు మీది?"

చెప్పాడు ముసలయ్య.

"ఒక్కడివే వచ్చావా?"

"అవును. మా అబ్బాయిగారు వచ్చి తీసుకెళ్తానని వుత్తరం రాస్తే వచ్చాను."

"టిక్కెట్ కొనివ్వ లేదా?"

ముసలయ్య చొక్కాకున్న ఒకే ఒక జేబులోంచి టిక్కెట్ తీసి టి. సి. కి చూపించాడు. కొద్దిగా అసంతృప్తి పొడ చూపింది టి. సి. మొహంలో, తన అంచనా తప్పినందుకు.

"బయటకు అటువైపు వెళ్ళాలి." చూపించాడు అవుట్ గేట్ వైపు, టిక్కెట్ తిరిగి ఇచ్చేసి ముసలయ్య చేతిలో సంచితోఅటువైపుకదిలాడు ఇక అబ్బాయిగారు కనపడరనే నిశ్చయానికి వచ్చి.

రైల్‌స్టేషన్‌లోంచి బయటకివచ్చాడు ముసలయ్య. అంతా విచిత్రంగా వుంది ముసలయ్యకి. కార్లు, బస్సులు, ఆటోలు, మిలటరీ ట్రక్కులు.

చాలా సేపు ఏంచేయాలోపాలుపోలేదు ముసలయ్యకి. కొద్దిగా భయం ప్రవేశిం చింది ముసలయ్యకు. ఎలా? ఎలా అబ్బాయిగారింటికి వెదుక్కుంటూ వెళ్ళ డం?

దూరంనుంచి ముసలయ్యనే గమని స్తున్న ఒకతను ముసలయ్య దగ్గరికి నడిచి అడిగాడు హిందీలో.

"కహఁజానా బేటా?"

ముసలయ్యకి హిందీ రాదనిగ్రహించి అడిగాడు వెంటనే తెలుగులో మళ్ళీ.

"ఏడ కెళ్ళాలి?"

ముసలయ్య అబ్బాయిగారు స్టేషన్‌కి రాని సంగతి చెప్పాడు.

"నువు ఒక్కడివే వచ్చావా?" అడి గాడు. ఏ అక్కయ్యతోనో వచ్చివుంటే మంచి లాభం గిట్టుబాటయేది అను కున్నాడు వాడు మనసులో.

ముసలయ్య చొక్కాకున్న కుడి జేబులోంచి రెండుగా మడిచిన పోస్టుకార్డు తీసి అతనికి అందించిచెప్పాడు, కొద్దిగా ఆశగా.

"అబ్బాయిగారు స్టేషన్‌కి రాకపోతే దీన్ని ఎవరికయినా చూపించమన్నాడు మా అయ్య. దీంట్లో రాసివుంది చిరు నామా."

అతను కొన్ని క్షణాలు ఆకార్డు తిర గేసిచూసి, మళ్ళీ తిరిగి ఇచ్చేశాడు ముస లయ్యకి.

"మీరు తీసుకెళ్తారా?" మళ్ళీ ఆశగా అడిగాడు ముసలయ్య అతన్ని.

చిరునవ్వు నవ్వి చెప్పాడతను.

"తప్పకుండా. రిక్షాలో పోదాం. నడిచి వెళ్ళటం కష్టం ఏం?"

"సరే" అన్నాడు ముసలయ్య.

నీ దగ్గిర మరి రిక్షాకు డబ్బుందా?

తల పంకించాడు ముసలయ్య, వున్న దన్నట్లుగా నిక్కరు జేబుమీద కుడిచేతి నుంచి.

"ఎంతుంది?"

"పది రూపాయలు ఇచ్చాడు మా అయ్య."

"ఇలాతే. రిక్షా మాట్లాడి తెస్తాను. ఇక్కడే వుండూ. ఆలస్యం అయితే రిక్షాలు వుండవు మరి."

ముసలయ్య అడిగాడు సంభ్రమంతో

"పదిరూపాయలే రిక్షాకు?"

"అవును నేను అబద్ధం చెప్తున్నా ననుకుంటే, నువ్వే అడుగు రిక్షావాడిని నాలుగు మైళ్ళు వెళ్ళాలి."


ముసలయ్యకి మనసులో సందేహంగా వున్నా, మారుమాట్లాడకుండా ఇచ్చాడు జేబులోంచే నాలుగు మడతలు పెట్టిన పదిరూపాయలనోటు తీసి.

ఆ నోటు అందుకుని గబగబా వెళ్ళాడు అతను. ముసలయ్య చాలాసేపు అతనికోసం, రిక్షాకోసంఎదురుచూసాడు ఎంత సేపయినా రాలేదుఅతను. నుంచుని నించుని, అలాగే నించున్నాడు కాళ్ళు పీకేదాకా.

తను మోసపోయానని గ్రహించి మెల్లిగా నడిచాడు బయటికి. కొంచెం దూరంవెళ్ళి ఒకచోట ఆగిపోయాడు. ముసలయ్య కంట పడిందో ఫోటో స్టుడియో. ఆశ్చర్యంగా, ఆనందంగా చూడసాగాడు దానివంక.

చాలా పెద్ద ఫోటో స్టుడియో అది. బయటకి కనబడేలాఅనేకమందిఫోటోలు అమర్చారు. ఎప్పుడూ అలాంటి స్టుడియో చూడలేదు ముసలయ్య. ఎంతోఆనందం వేసింది. తన పదిరూపాయలు పోగొట్టు కున్నానన్న విచారం మాయమయింది తాత్కాలికంగా.

కాసేపు అబ్బాయిగారు ముసలయ్య మనసులోంచి మాయమయ్యాడు. తదే కంగా చూడసాగాడు ఆ బొమ్మల వంక



పావుగంట. అరగంట. అరగంటసేపు అలా చూసినా తనివి తీరలేదు ముసలయ్యకి. తనూ అలా ఫోటో తీయించుకుంటాడు.

ముసలయ్య సికింద్రాబాద్‌కి వచ్చి అప్పటికే గంటంబావు దాటింది. రాత్రి తొమ్మిదింపావు అయింది. ఫోటో స్టుడియోలో లైట్లు ఆర్పేసి, తలుపులు వేయసాగారు.

చాలా సేపటినుంచి తమ స్టుడియో ముందు నిలబడివున్న ముసలయ్యని అడిగాడు, స్టుడియోలో పనిచేసే కుర్రాడు.

"ఏం కావాలి?"

"ఏం లేదు" తడబడ్డాడు.

"మరయితేఎందుకిక్కడనిలబడ్డావు?

"బొమ్మలు చూస్తున్నాను."

ముసలయ్యకి ఓ ఆలోచన తట్టింది." జేబులోంచి పోస్ట్‌కార్డు తీసి ఆ కుర్రాడికి అందించి చెప్పాడు.

"ఈ వుత్తరంలో మా అబ్బాయిగారి చిరునామా వుంది. ఎలా వెళ్లాలోచెప్పు."

ఆ కుర్రాడి దగ్గర నుంచి స్టుడియో యజమాని అందుకున్నాడు కార్డు.కార్డుని రెండువైపులా చూసి ఇచ్చేసాడు

"దీంట్లో ఎడ్రస్ లేదు."

"ఆ! వుండాలే?" ఆశ్చర్యంగా అన్నాడు ముసలయ్య

"కార్డు ఒకవైపు తడిసింది. అక్షరాలు చెరిగిపోయాయి ఎడ్రస్ తడిసి చెరిగిపోయి వుంటుంది."

ముసలయ్యకి గుర్తువచ్చింది. దాహం వేస్తే, రైల్లోంచి ఓ స్టేషన్‌లో దిగి, పంపు దగ్గిర నీళ్ళు తాగిన విషయం. అప్పుడు నీళ్ళు తన చేతిలోంచి కారి, మోచేతిమీదుగా జేబులోకివెళ్ళిన సంగతి గుర్తుకు వచ్చింది. అప్పుడు చెరిగిపోయి వుంటుంది చిరునామా.

ఇందాక మొదలయిన భయం కొద్దిగా ఎక్కువయింది ముసలయ్యకి.

"ఆయనేం చేస్తారు?" అడిగాడు కుర్రాడు.

"ఈ వూళ్లోనే వుద్యోగం చేస్తారు. ఫోటోలు కూడా తీస్తారు.

స్టుడియో తాళం వేసుకుని వెళ్ళిపోయారు ఇద్దరూ.

ఆకాశం నిండా నక్షత్రాలు కనబడకుండా దట్టంగా మేఘాలు ఆవరించుకుని వున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. సన్నగా వుండి వుండి చినుకులు పడుతున్నాయి.

ఆకలిగా వుంది ముసలయ్యకి. సంచీ తెరచి, లోపలనుంచి ఆవిరికుడుము పొట్లం తీసాడు. తనే స్వయంగా చేసుకున్నాడు. కొంతరైలులో తిన్నాడు. మిగిలింది అబ్బాయిగారి కివ్వచ్చని దాచి వుంచాడు.

సంచిని మోచేతికి తగిలించుకుని, మినపకుడుము తింటూ నడవ సాగాడు. రోడ్డు ప్రక్కన దడ దడ మంటూ ప్రక్కనుంచి డబల్‌డెక్కర్ బస్ వెళ్తున్నప్పుడల్లా, ముసలయ్య గుండెలు అదురుతున్నాయి.

తన వూళ్లో కార్లు కూడా ఎరగడు ముసలయ్య. అప్పుడప్పుడు బస్సులు మాత్రం చూసేవాడు. అంత పెద్ద మేడ బస్సులు వుంటాయని కూడా విని ఎరగడు ముసలయ్య. వాటిని చూస్తే ఎందుకో దయ్యాన్ని చూసినట్లుగా భయంగా వుంది వేగంగా వెళ్తున్న ఆ బస్సుల్లోకి చాలామంది పరిగెత్తుతూనే ఎక్కటం ఎంతో సంభ్రమంగా వుంది ముసలయ్యకి.

కడుపు నిండింది. కాని దాహం మొదలయింది. మంచి నీళ్ళు తాగుదా మంటే ఎక్కడా పంపులకనపడలేదు ముసలయ్యకి. ఎవరిని అడగాలో కూడా బోధపడలేదు. ఆ పైన ఏం చేయాలో కూడా తెలియ లేదు,

చాలా సేపు ఓ మెట్టుమీద కూర్చున్నాడు ముసలయ్య. క్రమంగా దాహం అధికం అవుతోంది. అయ్య గుర్తుకు వచ్చి గుండె బరువెక్కింది. తను వంటరిగా రాకుండా వుంటే బావుండేది అనిపిస్తోంది. ముసలయ్యలో మొదలయిన భయం ఎక్కువతోంది క్రమంగా

ఇప్పుడు నగరం నిద్రపోతున్నట్టుగా వుంది. నిశ్శబ్దంగా వుంది. షాపులన్నీ కట్టేశారు. రోడ్డుమీద జనం ఇందాకటిలా తిరగడంలేదు. వీధి దీపాలు మాత్రమే వెలుగుతున్నాయి. వాన పెద్దదయింది. ఉరుములు, మెరుపులు ఎక్కువవుతున్నాయి.

ఇంత పెద్ద పట్టణంలో తనొక్కడే నిశాచరుడిలా...

ఏడుపు వస్తోంది ముసలయ్యకి ఇప్పుడు. తనని తీసుకువెళ్ళడానికి రానందున అబ్బాయిగారిమీద కోపం కూడా వస్తోంది. ఆయన స్టేషన్‌కి వచ్చి వుంటే, తనిప్పుడు హాయిగా పడుక్కొని నిద్రపోతూండేవాడు.

తను కూర్చున్న అరుగుమీదే, కొంచెం దూరంలో ఎవరో పడుకుని వున్నారు. నిద్రపోవటం లేదు వాళ్ళు. అందుకు గుర్తుగా, వాళ్ళు తాగే బీడీలు ఎర్రగా మెరుస్తున్నాయిచీకటిలో, అప్పుడప్పుడు.

ముసలయ్యకి చలి, భయం, దుఃఖం పెరిగాయి. తను నిస్సహాయుడయ్యాడని మనసులో పూర్తిగా ఇంకగానే ఏడుపు వస్తోంది. నెమ్మదిగా మొదలయిన ఏడుపు క్రమంగా ఎక్కువయింది. బయటకి వినబడేలా ఏడుస్తున్నాడు.

అరుగుమీద పడుకున్న వాళ్ళలో ఒకరు అడిగారు బీడి విసిరేసి.

"ఎందుకబ్బాయ్ ఏడుస్తున్నావ్?"

ముసలయ్య సమాధానం చెప్పకుండా ఏడవసాగాడు వెక్కి వెక్కి.

"నిన్నే? దేనికి?" మళ్ళా వినబడింది అదే గొంతు, కొద్దిగా గరకుగా.

ముసలయ్య తలతిప్పి ఓసారి అటూ వైపు చూసి గొంతుపెంచాడు. వర్షం కుండపోతగా కురుస్తోంది. ఆ వర్షంలో కూడా 'మేడ బస్సులు' తిరుగుతున్నాయి, గుండెలదిరేలా రొద చేసుకుంటూ.

"ఇక్కడికిరా. మాట" ఇంకొక కంఠం పిల్చింది. ఆడ కంఠం అది.

ముసలయ్య వెంటనే వెళ్ళలేదు. నాలుగయిదుసార్లు వాళ్ళు పిలిచాక వెళ్ళాడు వాళ్ళ దగ్గిరికి.

"ఈ వూరు కాదా?" మొదటి గరకు కంఠం అడిగిందిచీకట్లోంచి. ముసలయ్య చేతిలోనిసంచీ వాళ్ళ కంటబడింది.

"కాదు."

"ఎవరింటికి?"

చెప్పాడు.

"మరి వెళ్ళలేదే?"

జరిగింది చెప్పాడు ముసలయ్య దీనంగా.

"అరి దొంగనాయాలు? పదికాజే సాడా?" ఆడ కంఠం పలికింది.

"ఇప్పుడెక్కడికి వెళ్తావుగాని నువు కూడా మాకాడ తొంగో. రేపు చూద్దాం ఏం చేయాలో."

సందేహించాడు ముసలయ్య.

"ఫర్లే." ఆడకంఠం ధైర్యం చెప్పింది.

ముసలయ్యకి నిద్ర వస్తోంది, ప్రయాణంవల్ల కలిగిన బడలికవల్ల. సంచీ తెరచి, అందులోంచి గొంగళి తీసి పరిచాడు వాళ్ళ పక్కన.

"ఏందది?" అడిగింది ఆడకంఠం.

"గొంగళి" చెప్పింది మొగకంఠం.

"అబ్బో! ఫర్లే" అన్నది ఆడకంఠం.

ముసలయ్య పడుకున్నాడు తల కింద సంచీ వుంచుకుని. తను పాకలోని నులకమంచం గుర్తుకు వచ్చింది. అయ్య గుర్తుకు వచ్చాడు. కుళ్ళి ఏడవసాగాడు.

"ఏడవక, మేం లేమూ?" అన్నాడు మగవాడు ముసలయ్య గొంగళిమీదకి వత్తిగిలి, ముసలయ్యకి ఆనుకుని పడుకుని.

"దేనికి వచ్చావ్?" అడిగింది ఆడ కంఠం.

"మా అబ్బాయిగారు రమ్మని రాసారు, ఓ వారం పాటు ఆయనతో వుండటానికి. ఆయన భార్యకి సుసీ చేసిందట. ఇంట్లో మనిషి కావాలని పిలిపించారు...ఆయన దగ్గర ఓ గమ్మత్తు పెట్టెవుంది. ఆ పెట్టె ముందు మనం నిలబడితే ఏటో చేస్తాడాయన. ఆ పెట్టె లోంచి మర్నాడు మన బొమ్మ తీస్తాడు. అచ్చం మనం ఎలా వున్నామో అలానే వస్తుంది మన బొమ్మ. మా వూరు వచ్చినప్పుడు తెచ్చారు ఆయన. ఆరింట్లో అందరి బొమ్మలూ దించారు. నా బొమ్మ కూడా దించమని అడిగాను కాని ఇంకోసారన్నారు...నిజానికి ఆరితో చెప్పి నా బొమ్మ తీయించుకోవాలని వచ్చాను. బలే పెట్టె అది. మెడకి తగిలించుకోడానికి తాడులాంటి దేదో వుంటూంది. ఓసారి..."

"అదా. నాకు తెల్సు. కెమేరా అంటారు దాన్ని. డబ్బులిస్తే ఇక్కడా తీస్తారు అలాంటి బొమ్మలు" మొగ కంఠం చెప్పింది.

"ఆ. అవును. కెమేరా. గుర్తొచ్చింది. బలే గమ్మత్తు చేస్తారాయన..."

ముసలయ్య కాసేపు ఆనందంగా కెమేరా గురించి మాట్లాడాడు.

"బొమ్మ దిగుదామని వచ్చావన్న మాట?"

"అవును. మంచి బట్టలుకూడా తెచ్చు కున్నాను."

"బీడీ తాగుతావా?'' అడిగాడు ముసలయ్య పక్కనే గొంగళిమీద పడు కొన్న మొగాడు.

"ఊహు. మా అయ్య తాగుతాడు."

ముసలయ్య గొంగళీమీద వుంది ఆ మొగవాడి ఆలోచన. సంచీమీద వుంది ఆడదాని ఆలోచన

మొగవాడు నోట్లో బీడీ వుంచుకుని, అగ్గిపుల్ల గీసాడు. అగ్గిపుల్ల వెలుతురు చూడగానే ముసలయ్య తల తిప్పాడు ఆ మొగవాడి వైపు. అదే సమయంలో వాళ్ళిద్దరూ ముసలయ్య వైపు చూసారు ఆసక్తిగా.

కెవ్వున కేక పెట్టాడు ముసలయ్య అసహ్యంగా, భయంగా, భయంకరంగా వున్న ఆ కుష్టురోగి మొహంవంక చూసి. ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి వాడి కళ్ళు.

అగ్గిపుల్ల వెలుగులో ముసలయ్య చెవులకున్న బంగారు పోగులు తళుక్కు మన్నాయి.

''భయపడమాక" అన్నాడు కుష్టు రోగి బీడీ అందించుకోకుండానే అగ్గి పుల్లని వూదేసి.

"అస లెందుకు వెలిగించావ్?" ఆడ కంఠం కోప్పడింది.

ముసలయ్య లేవబోయాడు.

"లేవకు."

లేవనివ్వలేదు ఆ కుష్టురోగి. రెండు మొండిచేతులు ముసలయ్య గుండెల మీద వేసి అణచిపట్టాడు బలంగా.

"వదులు. ఛి." గింజుకుంటూ అరి చాడు ముసలయ్య. భయంతో గుండె ఆగిపోయేలా వుంది ముసలయ్యకి.

"అరవక. ఏంచేయం" ఆడదికూడా లేచి ముసలయ్యని కదలకుండా పట్టు కుంది.

ముసలయ్య అరవకుండా నోరు నొక్కాడు కుష్టురోగి.

"గొంగళి నీకు, పోగులు నాకు," అంటోంది ఆ ఆడది సంతోషంగా.

ముసలయ్యకి భయంతో స్పృహ తప్పింది. తన గొంతుచుట్టూ నాలుగు మొండిచేతులు బిగుసుకుపోవడం అవ గతం అయింది, ఏడేళ్ళ ముసలయ్యకి స్పృహ తప్పబోయేముందు.

* * *

"రెండు రోజులయి వుంటుందా?" పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముసలయ్య శవాన్ని పరిశీలనగా చూసి అడిగాడు పోలీస్ డాక్టర్‌ని.

"ఉహు. రోజు దాటివుంటుందంతే" చెప్పాడు డాక్టర్.

"గొంతు పిసికి చంపారు."

''అవును."

పోలీస్ కానిస్టేబుల్ ముసలయ్య జేబులో వెదికి ఓ పోస్టుకార్డ్ తీసి అందించాడు ఇన్‌స్పెక్టర్‌కి. ఆ కార్డు చదివి తల పంకించాడు ఇనెస్పెక్టర్.

"ముసలయ్య ఈ కుర్రాడి పేరు. ఎవరో సంతకం చెరిగిపోయింది కాని, ఇక్కడికి పిలిపించారు. స్టేషన్‌కి వస్తా నని, ఫర్వాలేదని, వంటరిగా రైల్లో పంపమని వ్రాసారు.''

"ఇతని చెవులు చూసారా? చెవులకి బంగారు వస్తువేదో వుండివుంటుంది. గొంతు పిసికి చంపి, చెవులనుంచి పీకారు చచ్చిన చాలాసేపటికిగాని పీక లేదు వాటిని అందుకే రక్తం కారలేదు చెవులనుంచి."

"వాటి కోసమే చంపివుండవచ్చు."

దూరంగా ఆగిన పోలీస్ జీప్‌లోంచి దిగివచ్చాడు పోలీస్ ఫొటోగ్రాఫర్ పావుగంట తర్వాత.

"మీ కోసమే చూస్తున్నాను. త్వరగా మీ పని కానిస్తే, శవాన్ని మార్చురీకి పంపుతాను"

"కుర్రాడేనే. వివరాలు తెలిశాయా?" అడిగాడు ఫొటోగ్రాఫర్ కెమేరాకి ఫ్లాష్ అమరుస్తూ.

"పేరు ముసలయ్య. ఈ వూరుకి మొన్నరాత్రి వచ్చివుంటాడు బహుశ, ఈ పోస్టుకార్డ్ ప్రకారం."

"ఏ పోస్టుకార్డు?" అడిగాడు ఫొటో గ్రాఫర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వంక చూసి.

ఇన్‌స్పెక్టర్ అందించిన పోస్టుకార్డ్ అందుకున్నాడు. గుండె ఝల్లుమంది పోలీస్ ఫొటోగ్రాఫర్‌కి.

"మై గుడ్‌నెస్? ముసలయ్యా?" అరిచాడు బాధగా, కంగారుగా.

అంతా ఫొటోగ్రాఫర్ వైపు చూసారు.

"ఇది...ఇది నేను వ్రాసిన వుత్తరం. నా అడ్రస్ చెరిగిపోయిందే?..."

"ఇతను మీకు తెలుసా?" అడిగాడు డాక్టర్.

"మా పాలేరు కొడుకు. స్టేషన్‌కి వెళ్ళలేకపోయాను. ఓ స్నేహితుడిని పంపానుకూడా. రాలేదన్నాడే?''

ఎవరు మాట్లాడలేకపోయారు.

''మై గుడ్‌నెస్." ఫొటోగ్రాఫర్ కంఠం బాధతో వణికింది. అతని కళ్ల వెంట నీళ్ళు కారసాగాయి, బురదలో పడివున్న ముసలయ్య శవాన్ని చూసి.

వెంటనే కళ్ళు తుడుచుకుని, కెమేరా లెన్స్ సరిచేసాడు. మోకాళ్ళమీదికి వంగి బురదలో పడివున్న ముసలయ్య శవాన్ని ఆరు కోణాలనుంచి గబగబా ఫొటోలు తీసాడు.

ఆరుసార్లు ఫ్లేష్‌లు వెలిగాయి,

ముసలయ్య శవాన్ని స్ట్రెచర్‌లోకి ఎత్తుతూండే అన్నాడు ఫొటోగ్రాఫర్, నీళ్ళు నిండిన కళ్ళతో.

''నా బొమ్మ తియ్యి అబ్బాయిగారు, నా బొమ్మ తియ్యి అబ్బాయిగారు అని నేను మా స్వగ్రామం వెళ్ళినప్పుడల్లా అడుగుతూండేవాడు, పిచ్చివాడు. వాడి కోరిక తీర్చా నివ్వాళ."